సాక్షి
కాకినాడ

బుధవారం | 1 | మార్చి | 2023



రేపటి నుంచి కోరుకొండ ఉత్సవాలు


మధురపూడి: కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు.



విరాళానికి పన్ను రాయితీ

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో అన్నదాన పథకానికి ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను రాయితీ ఉంటుందని ఈఓ కృష్ణచైతన్య తెలిపారు.

డెల్టాలకు 7,555 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 7,555 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,425, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.60 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఫింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లాలో ఈనెల పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి మంగళవారం రాత్రి తెలిపారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని 2,74,339 మంది పింఛన్‌దారులకు బుధవారం రూ 75.48 కోట్ల మేర పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వారిగా బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశామన్నారు. ఉదయం నుంచి ఆయా పరిధిల్లో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. ఐదు రోజుల వ్యవధిలో జిల్లాలో నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసేలా సిబ్బందికి, వలంటీర్లకు ఆదేశాలిచ్చినట్లు పీడీ వివరించారు.

నేడు లోవకు దేవదాయ మంత్రి రాక

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రానున్నారని లోవదేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఎస్.అన్నవరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చే మంత్రి సత్యనారాయణ ఆతర్వాత లోవ దేవస్థానానికి వస్తారన్నారు. అమ్మవారిని దర్శించి, లోవలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారన్నారు. పాలనావ్యహారాలపై అధికారులతో సమిక్షిస్తారన్నారు.

దేవస్థాన విభాగాల్లో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని వ్రతాలు, సెంట్రల్ స్టోర్స్, ప్రసాదం, అన్నదానం విభాగాలలో దినుసులు, పూజాద్రవ్యాల వినియోగం తీరు పర్యవేక్షణకు నాలుగు కమిటీలను నియమించినట్లు ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఇటీవల వ్రతాల విభాగంలో పూజాద్రవ్యాల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలడంతో వ్రతాల స్టోర్ కీపర్‌ను విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. ఆ తరువాత మిగిలిన విభాగాల మీద కూడా ఈఓ దృష్టి సారించారు. ప్రతీ విభాగంలోను సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లతో కమిటీ వేశారు. ఆ కమిటీలు రోజు వారీ ఉపయోగించే దినుసులు పరిశీలించి ఏమైనా మిగిలితే అదే రోజు దేవస్థానానికి జమ చేస్తారు. ఈఓకు నివేదిక సమర్పిస్తారు. దీని వలన ఆయా విభాగాలలో పారదర్శకత ఉంటుందని భావిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

నన్నయలో ఫిష్ వెల్ఫేర్ టెక్నాలజీపై ట్రైనింగ్




ట్రైనింగ్‌లో భాగంగా ఆక్వా చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ ఆక్వాకల్చర్, ఫిష్ వెల్ఫేర్ ఇనీషియేటివ్ ఇండియా ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ మేజర్ కార్ప్స్'లో సంక్షేమ అవసరాలు అధ్యయనం - కార్యాచరణ ప్రణాళిక అమలు' అనే అంశం పై మంగళవారం ట్రైనింగ్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ వీసీ ఇన్‌చార్జ్ జీవీఆర్ ప్రసాదరాజు, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి. జానికిరామ్‌లు ప్రారంభించారు. ఫౌండేషన్‌తో యూనివర్సిటీకి గతంలో కుదిరిన ఒప్పందం మేరకు ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ జరుగుతుందని వీసీ పేర్కొన్నారు. చేపల మెరుగైన జీవనానికి ఫిష్ వెల్ఫేర్ ఇనీషియేటివ్ ఇండియా ఫౌండేషన్ పనిచేస్తుందని, వెల్ఫేర్‌కి సంబంధించిన కొత్త టెక్నిక్స్‌ని రైతులకు నేర్పిస్తారన్నారు. ఆక్వా కల్చర్‌కి సంబంధించి యూనివర్సిటీలో కొత్త పరిశోధనలను ప్రారంభించి విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ కల్పించి, సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. తద్వారా విద్యార్థులు సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశాలుంటాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రమణేశ్వరి, పార్ట్‌నర్ షిప్ మేనేజర్ మనీష్, ఎండీ పి. కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: హోలీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసింది. రావులపాలెం డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ మంగళవారం ఈ విషయం తెలిపారు. మార్చి 5 నుంచి 8వ తేదీ వరకూ ఈ యాత్ర ఉంటుందన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసుకు మనిషికి రూ.3 వేలుగా చార్జీ నిర్ణయించామన్నారు. కాణిపాకం, అరుణాచలం, కాంచీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ మీదుగా యాత్ర సాగుతుందన్నారు. వివరాలకు డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని కుమార్ కోరారు.



చక్కగా.. పక్కాగా..

- ఇంటర్ పరీక్షల పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రైవేటు యాజమాన్యాల వేధింపులకు కళ్లెం
- నేరుగా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ పొందే అవకాశం

సాక్షి, రాజమహేంద్రవరం: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం పరీక్షల విధానంలో సంస్కరణలకు నాంది పలికారు. హాల్ టికెట్ పొందే విధానాన్ని సులభతరం చేశారు. పరీక్ష హాలులో నిబంధనలు కఠినతరం చేశారు. పరీక్షలు జరిగే గదులన్నింటిలో సీసీ కెమెరాల నిఘా పెట్టనున్నారు.



జంబ్లింగ్ విధానం

పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. వేర్వేరు కళాశాలల విద్యార్థులకు కలిపి కేటాయించే కేంద్రాన్ని జంబ్లింగ్ అంటారు. వీటిలో ఒకే కళాశాలకు చెందిన విద్యార్థులు తక్కువగా ఉంటారు. ఫలితంగా మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట వేయవచ్చన్నది అధికారుల అభిప్రాయం. ఏ కళాశాల విద్యార్థులకు అదే కళాశాలలో పరీక్ష కేంద్రం ఖరారు చేస్తే సెల్ఫ్ సెంటర్‌గా పరిగణిస్తారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇలాంటి కేంద్రాలు 4 మాత్రమే ఉన్నాయి. ఈ కేంద్రాలపై ఇంటర్ బోర్డ్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లతో పాటు బోధనేతర సిబ్బందిని సైతం పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ఇతర కేంద్రాల్లో పని చేయాలని ఆదేశించారు.

ఫీ'జులుం' ఇక చెల్లదు

పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం జులుం ప్రదర్శించేవి. పూర్తి ఫీజు చెల్లిస్తేనే కానీ హాల్ టికెట్ ఇవ్వబోమని బెదిరించేవి. తప్పని పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లించేవారు. దీనిపై గతంలో అనేకసార్లు ఆందోళనలు చోటు చేసుకునేవి. ఫిర్యాదులు వచ్చేవి. ఈసారి విద్యార్థులకు ప్రభుత్వం అటువంటి బాధ తప్పించింది. నేరుగా ఆన్‌లైన్ నుంచే హాల్ టికెట్ పొందే సౌలభ్యం కల్పించింది. పుట్టిన తేదీ, పదో తరగతి రిజిస్టర్ నంబర్, ఆధార్ నంబర్‌లో ఏవైనా రెండింటితో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాటిని కలర్ ప్రింట్ తీసుకోవాలి. గతంలో హాల్ టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం ఉండేది. ఈసారి దీని నుంచి మినహాయింపునిచ్చారు.

సీసీ కెమెరాలతో నిఘా

పరీక్షల పకడ్బందీ నిర్వహణకు పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తారు. పోలీసు స్టేషన్ నుంచి ప్రశ్నపత్రం రాగానే కెమెరా ముందు ఓపెన్ చేసి, సంబంధిత అధికారులు సంతకాలు చేయాలి. తర్వాతే విద్యార్థులకు ఇవ్వాలి. ప్రతి కేంద్రానికీ ఇంటర్‌నెట్ సౌకర్యం తప్పనిసరి. సీసీ కెమెరాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఇంటర్ బోర్డు పరిశీలిస్తుంది. పరీక్షలు నిర్వహించే ప్రతి కళాశాలలోనూ కేవలం చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారి వద్ద మాత్రమే సెల్‌ఫోన్ ఉండాలి.

75 శాతం హాజరు తప్పనిసరి

ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ పొందాలంటే విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 75 శాతం హాజరు తప్పనిసరి చేశారు. అలాంటి విద్యార్థుల హాల్ టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. అంతకంటే తక్కువ హాజరు ఉన్న విద్యార్థులు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు కాండొనేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 65 – 60 శాతం అటెండెన్స్ ఉంటే రూ.2 వేలు, 66 – 70 శాతం ఉంటే రూ.1,500, 71 – 74 శాతం ఉంటే రూ.1,000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు మొత్తాన్ని ఒకే డీడీగా చెల్లించి, ఆర్‌ఐఓ కార్యాలయంలో అందిస్తే ఆయా విద్యార్థుల హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. సైన్స్ గ్రూప్ వారికి 60 శాతం కంటే తక్కువ హాజరు ఉంటే పరీక్షకు అనుమతించరు. ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులకు ఆ పరిమితి లేకపోయినా.. రెండో సంవత్సరం నుంచి ప్రైవేటు విద్యార్థులుగా పరిగణిస్తారు. వారికి కళాశాల నుంచి, ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలూ దక్కవు.

ఉమ్మడి తూర్పు గోదావరిలో....

ఇంటర్ పరీక్ష కేంద్రాలు	:	140
మొత్తం విద్యార్థులు	:	1,01,535
మొదటి సంవత్సరం	:	47,442
ద్వితీయ సంవత్సరం	:	52,993
ఒకేషనల్ ఫస్టియర్	:	5,079
ఒకేషనల్ సెకండియర్	:	5,121
పరీక్ష తేదీలు	:	ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ
సమయం	:	ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు

ఆదేశాలకు అనుగుణంగా నిర్వహణ



ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా పరీక్షలు పకడ్బందీగా, జంబ్లింగ్ విధానంలో నిర్వహిస్తాం. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరా నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా ప్రతి కేంద్రంపై నిఘా ఉంటుంది.

– ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ప్రాంతీయ అధికారి, ఇంటర్మీడియెట్ బోర్డ్, రాజమహేంద్రవరం

నేడు నిడదవోలుకు సీఎం జగన్

- ఎమ్మెల్యే కుమార్తె రిసెప్షన్‌కు హాజరుకానున్న ముఖ్యమంత్రి



నిడదవోలులో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కె.మాధవీలత, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు రానున్నారు. నిడదవోలు పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు కుమార్తె రిసెప్షన్‌కు హాజరు కానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10 గంటలకు సీఎం నివాసం నుంచి బయలు దేరి 10.40కు హెలీ కాప్టర్‌లో నిడదవోలు పట్టణం సుబ్బరాజుపేటకు చేరుకుంటారు. 10.40 నుంచి 10.50 వరకు ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతారు. 11 గంటలకు సెయింట్ ఆంబ్రోస్ గ్రౌండ్‌లోని రిసెప్షన్ ప్రదేశానికి చేరుకుంటారు. 11.00 నుంచి 11.15 వరకు రిసెప్షన్‌లోపాల్గొని ఎమ్మెల్యే కుమార్తెను ఆశీర్వదిస్తారు. 11.25 నుంచి 11.40 వరకు స్థానిక నేతలతో మాట్లాడుతారు. మధ్యాహ్నం 12.25కు తిరిగి హెలీకాప్టర్‌లో తాడేపల్లిలోని సీఎం నివాసానికి చేరుకుంటారు.

సీఎం రాకను పురస్కరించుకుని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి మంగళవారం మరోసారి పరిశీలించారు.

అన్నదాతకు అండదండగా..



రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి విజయకుమార్ తదితరులు

- వైఎస్సార్ రైతు భరోసా సాయం జమ
- జిల్లాలో 1,69,989 రైతులకు లబ్ధి

కాకినాడ సిటీ: జిల్లాలో ఈఏడాది వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ప్రభుత్వం మూడో విడత సాయం విడుదల చేసింది. దీనివల్ల 1,69,989 రైతు కుటుంబాలకు రూ.37.23 కోట్ల మేర లబ్ధి చేకూరింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వరుసగా నాలుగో ఏడాది కూడా ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలిలో బటన్ నొక్కి నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్చువల్ విధానం కింద కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. సీఎం కార్యక్రమం ముగిశాక విజయ్‌కుమార్ రైతులనుద్దేశించి మాట్లాడారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ద్వారా ఏడాదికి ఒక్కో రైతు కుటుంబానికి రూ.13,500 ఆర్థిక సహాయం అందుతోందన్నారు. మొదటి విడత ఖరీఫ్ పంట వేసే ముందు మేలో రూ.7,500, రెండో విడత అక్టోబర్‌లో ఖరీఫ్ పంట కోత సమయంలోనూ, రబీ అవరాల కోసం రూ 4000, మూడో విడత ఫిబ్రవరిలో రూ.2000 రైతులకు అందతోందని వివరించారు. 2019లో రూ.181.02 కోట్లు, 2020–21లో రూ. 216.22 కోట్లు, 2022–23లో 190.71 కోట్లు రైతులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వై జ్యోతిర్మయి, ఏడీ జీవీ పద్మశ్రీ, వ్యవసాయ టెక్నికల్ అధికారి ఎ గాయత్రీదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు. సకాలంలో పథకం కింద ఆర్థిక సహాయం పొందిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతు భరోసా లబ్ధి వివరాలు (రూ. కోట్లలో)

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి మొత్తం
కాకినాడ రూరల్	10,768	2.51
కాకినాడ అర్బన్	148	0.04
పిఠాపురం	26,491	5.54
తుని	38,713	6.50
ప్రత్తిపాడు	32,247	7.94
పెద్దాపురం	14794	3.34
జగ్గంపేట	24,955	6.12
ముమ్మిడివరం (తాళ్లరేవు)	4793	1.33
అనపర్తి (పెదపూడి)	7301	1.70
రామచంద్రపురం (కాజులూరు)	9780	2.22
మొత్తం	1,69,989	37.23

హెల్మెట్ లేదా.. వాహనం కదలదు

- నేటి నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి
- పోలీసులు ఇక నుంచి కఠిన చర్యలు



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు చాలామంది ప్రాణాలు బలిగొంటున్నాయి. ఇందులో యువత ఎక్కువగా చనిపోతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాల సరళిని గమనిస్తే చాలామంది ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించడం లేదు. మృతులందరూ ఈ తరహా కోవలోకే వస్తున్నారని పోలీసులు కూడా గుర్తించారు. 80 శాతం ప్రమాదాల్లో తలకు గాయాలవల్లే ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఈ మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే హెల్మెట్ ధరించడం ఒక్కటే పరిష్కారం. ఇప్పటికే జాతీయ రహదారి భద్రత సంస్థ ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. దీనిని వాహన చోదకులు సీరియస్‌గా పరిగణించడం లేదు. ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ సీహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి ఈ అంశంపై ఫోకస్ పెట్టారు. ఈనెల(మార్చి) 1వ తేదీ నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఆయన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశారు. ఈ నిబంధన గట్టిగా అమలు చేసేందుకు పోలీసులు సన్నద్ధమయ్యారు.

శిక్ష ఇలా

హెల్మెట్ ధరించని వారిని ఆపి జరిమానా వేయడం పాత విధానం. ఇకపై అలా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే వాహనాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుంటారు. హెల్మెట్ కొనుగోలు చేసి ధరించేలా ప్రోత్సాహిస్తారు. హెల్మెట్ కొనుగోలు చేసి తీసుకువచ్చిన తర్వాతే వాహనాన్ని తిరిగి ఇస్తారు.

మన భద్రతకే అని గ్రహించాలి



రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే ఎక్కువ సంఘటనల్లో తలకు గాయాలవల్లే మృత్యువాత పడుతున్నారని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుంది. తాను మరణిస్తే కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి వాహన చోదకులు ఆలోచించాలి. మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్మెట్ తప్పనిసరి చేశాయి. ఇక నుంచి హెల్మెట్ ధరించక పోతే చర్యలు తప్పవు.

– సీహెచ్.సుధీర్‌కుమార్‌రెడ్డి. ఇన్‌చార్జ్ ఎస్పీ. తూర్పుగోదావరి జిల్లా

చిరుసాగుకు బహుప్రాధాన్యం



పెద్దాపురంలోని వ్యవసాయ క్షేత్రం

- ఆరోగ్యమే ప్రధానంగా అవగాహన
- స్వల్పకాలంలో లాభసాటి
- ఔత్సాహిక రైతులను సూచనలిస్తున్న వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్తలు

సామర్లకోట: కోవిడ్ తదనంతర కాలంలో చిరుధాన్యాలకు మంచి గుర్తింపు వచ్చింది. మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి ప్రజల ఆరోగ్యం రీత్యా రైతులు చిరుధాన్యాల సాగుపై శ్రద్ధ చూపేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు స్థానిక వ్యవసాయ క్షేత్రం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంచుతున్నారు. క్షేత్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ ఐ సుధీర్‌కుమార్ చిరుధాన్యాల సాగు విధానం, ప్రాధాన్యాన్ని ‘సాక్షి’కి వివరించారు. తక్కువ నీటితో జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామ, అరిక, వరిగ, ఊద, అండుకొర్రలు వంటి చిరుధాన్యాల సాగుకు వీలు కలుగుతుంది. సన్న, చిన్నకారు రైతులు బంజరు భూముల్లో సాగు చేసుకోడానికి ఈ సాగు లాభసాటిగా ఉంటుంది. ఎకరానికి మూడు నుంచి నాలుగు కిలోల విత్తనాలను సరిపోతాయి. తక్కువ కాలపరిమితి, తక్కువ చీడపీడల సమస్యలతో పాటు తక్కువ పెట్టుబడి ఈ సాగుకు ప్రోత్సాహకంగా ఉంటాయన్నారు. వర్షపాతం తక్కువగా ఉన్న సమయంలో సజ్జలు, రాగులు, కొర్రల పంటలకు 12 నుంచి 15 రోజులకు, మిగిలిన చిరు ధాన్యాలకు 18 నుంచి 20 రోజులకోసారి నీరు పెడితే సరిపోతుందని సుధీర్ కుమార్ తెలిపారు. చిరుధాన్యాలకు కేవలం అగ్గి తెగులు సమస్య ఉంటుందని, దానిని సకాలంలో గమనించి నివారించుకొంటే తక్కువ పెట్టుబడితో అన్ని కాలాల్లోను సాగు చేసి ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు.

బహుళ ప్రయోజనాలు

చిరుధాన్యాలు మనిషికి అవసరమైన మిటమిన్లు, ఖనిజాలు, ప్రొటీన్లు అందజేయడమే కాకుండా నెమ్మదిగా జీర్ణం అవుతూ, రక్తంలోని గ్లూకోజ్‌ను అదుపుచేస్తాయని సుధీర్‌కుమార్ అన్నారు. దాంతో చెక్కెర వ్యాధి నివారణకు దివ్యౌషధంగా చిరుధాన్యాలను గుర్తించారు, మాంసకృతులు, విటమిన్లు సూక్ష్మ పోషకాలు ఎక్కువగా ఉంటాయని, ఆరోగ్యవంతమైన జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయని, రోగ నిరోధక వ్యవస్థను పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. పాలల్లో కాల్షియం కంటే రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. సజ్జల్లో ఇనుము, జింక్ ఉంటాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధులు రాకుండా సజ్జలు దోహదపడతాయని ఆయన తెలిపారు.



వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న సజ్జలు



చిరుధాన్యం కొర్రలు

మెళకువలు పాటిస్తే సాగు లాభసాటే



మెట్ట ప్రాంతంలో రైతులు కొద్దిపాటి మెళకువలు పాటించి, అధిక దిగుబడిని ఇచ్చే రకాల గురించి తెలుసుకోవాలి. చిరుధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా పోషణ భద్రత ఏర్పడుతుంది. అనేక రకాల వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉంది. సాగుకు ముందుకు వచ్చే రైతులకు అవగాహన కల్పించి సబ్సిడీపై చిరుధాన్యాల విత్తనాలు వ్యవసాయశాఖ అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఐదు వేల ఎకరాలల్లో ఉన్న సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. మానవాళికి అవసరమైన సమగ్ర పోషక విలువతో కూడిన శ్రేష్టిక ఆహారాన్ని అందించటమే ప్రాముఖ్యంగా 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం జరిగింది.

– డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, వ్యవసాయ పరిశోధన క్షేత్రం, పెద్దాపురం

సమన్వయంతో అభివృద్ధి లక్ష్యాల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయకుమార్

- రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి విజయకుమార్
- పాల్గొన్న మూడు జిల్లాల కలెక్టర్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందరికీ అందజేసే క్రమంలో 'ఎవ్వరినీ వదిలి పెట్టవద్దు' అనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తే 2016 – 2030 మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని రాష్ట్ర ప్లానింగ్ కార్యదర్శి జీఎస్ఆర్‌కే విజయకుమార్ అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యాన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), స్పందనపై మంగళవారం ఆయన సమీక్షించారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలు, పలు సూచికలు నిర్దేశించిందని అన్నారు. దుర్భర పేదరికం, ఆకలిని పారదోలడం, ప్రాథమిక విద్య, లింగ సమానత్వం, పిల్లల్లో పౌష్టిక విలువలు, శిశు మరణాలు, గర్భిణుల మరణాలు, వ్యాధులు, పర్యావరణ కాలుష్యం, తాగునీరు, పరిశ్రమలు, కనీస అవసరాలు తీర్చడం, అవినీతికి తావు లేకుండా చూడడం, సమన్యాయం, సమానత్వం తదితర పలు అంశాల అధ్యయనానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, అమలుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వాటి ఫలితాలు ప్రతిబింబించక పోవడానికి ఆ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు కాకపోవడమే ప్రధాన కారణమని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనను మరింత సరళీకృతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 20 ప్రాధాన్యత సూచికలను నిర్దేశించిందన్నారు. వాటిలో ఆరు ఆరోగ్య, రెండు స్త్రీ, శిశు సంక్షేమ, నాలుగు విద్య, ఒకటి పురపాలక, ఐదు హోం, ఒకటి పంచాయతీరాజ్, ఒకటి వ్యవసాయ శాఖకు చెందినవి ఉన్నాయని వివరించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ప్రజల మధ్య స్పందన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ప్రతి వారం సగటున 380 నుంచి 400 వరకూ అర్జీలు వస్తున్నాయని, వాటిలో రెవెన్యూ 25 శాతం, పోలీసు 20 శాతం ఉంటున్నాయన్నారు. సివిల్ తగాదాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా స్పందన, గ్రామ/వార్డు సచివాలయం డేటా నమోదు, ఆరోగ్య సూచికలు, విద్య, పౌష్టికాహారం, పురపాలన, పర్యావరణం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

ప్రేమోన్మాదికి జీవిత ఖైదు

- కాదా దేవిక హత్య కేసులో కాకినాడ కోర్టు సంచలన తీర్పు
- 143 రోజుల్లోనే ముద్దాయికి కఠిన కారాగార శిక్ష
- ప్రేమను అంగీకరించలేదని యువతిని దారుణంగా హతమార్చిన దుర్మార్గుడు
- అప్పట్లో సంచలనం రేపిన ఘటన


హతురాలు దేవిక (ఫైల్)

కాకినాడ లీగల్: తనను ప్రేమించడం లేదని కక్ష కట్టి.. పదే పదే అడుగుతున్నా తన ప్రేమను నిరాకరించిందని రాక్షసుడిలా మారి.. ఓ యువతిని కత్తితో పొడిచి చంపిన ముద్దాయికి కేవలం 143 రోజుల్లోనే జీవిత ఖైదు (కఠిన కారాగార శిక్ష) విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవి మంగళవారం సంచలన తీర్పు చెప్పారు. వివరాలివీ..

ఈ దారుణ ఘటన గత ఏడాది అక్టోబర్‌లో జరిగింది. ముద్దాయి గుబ్బల వెంకట సూర్యనారాయణ స్వగ్రామం తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బాలవరం. ఐదేళ్లుగా కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ గ్రామంలోని మేనమామ వాసంశెట్టి జానకి రామచంద్రరావు ఇంట్లో ఉండేవాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన కాదా రాంబాబు, నాగమణి దంపతులు బతుకుతెరువు కోసం హైదరాబాద్‌లో ఉండేవారు. వారికి ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె దేవిక (21) కూరాడ గ్రామంలోని అమ్మమ్మ కొప్పిశెట్టి చంద్రమ్మ ఇంట్లో ఉంటూ కాకినాడ పీఆర్ కళాశాలలో డిగ్రీ చదువుకునేది. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ముద్దాయి సూర్యనారాయణ ఏడాది కాలంగా దేవిక వెంట పడుతూండేవాడు. అతడి వేధింపులు రానురానూ పెరిగిపోవడంతో తాళలేని దేవిక విషయాన్ని తన బంధువుల దృష్టికి తీసుకు వెళ్లింది. ఇరు కుటుంబాల వారినీ పెద్దల సమక్షంలో కూర్చోబెట్టి మాట్లాడారు. సూర్యనారాయణను పెద్దలు మందలించి పంపించేశారు. ఈ నేపథ్యంలో అతడు దేవికపై కక్ష పెంచుకున్నాడు. గత ఏడాది అక్టోబర్ 8న ద్విచక్ర వాహనంపై వస్తున్న దేవికను కాండ్రేగుల – కూరాడ మార్గం మధ్యలో అడ్డుకున్నాడు. నడిరోడ్డుపై కత్తితో ఆమెను 18 సార్లు విచక్షణారహితంగా నరికేశాడు. రక్తపు మడుగులో విలవిలలాడుతున్న దేవికను కాపాడేందుకు స్థానికులు విఫల యత్నం చేశారు. కాకినాడ జీజీహెచ్‌కు తరలించేసరికే ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై హతురాలు దేవిక చిన్నాన్న గుత్తుల బాలాజీ పెదపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పి.వాసు కేసు నమోదు చేయగా, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ దర్యాప్తు చేశారు.

స్థానికుల సహకారంతో ముద్దాయి సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. 24 గంటల్లోగా కాకినాడ కోర్టులో హాజరు పరిచారు. పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించి కేవలం 7 పని దినాల్లో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో 19 మంది సాక్ష్యులు చెప్పారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సూర్యనారాయణకు జీవిత ఖైదు (కఠిన కారాగార శిక్ష), రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కమలాదేవి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఆదిత్యకుమార్ వాదనలు వినిపించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన సీఐ శ్రీనివాస్, ఎస్సై వాసు, పోలీసు సిబ్బంది సుంకర శ్రీనివాసరావు, వేములూరి శ్రీనివాసరావు, బి.కృష్ణారెడ్డి, నవరపు గంగాధర్‌లను జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కాకినాడ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'దిశ' స్ఫూర్తితో, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏలూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు దిశానిర్దేశాలతో మహిళల భద్రతే ధ్యేయంగా ఈ కేసు దర్యాప్తు చేశామని చెప్పారు.


ముద్దాయి సూర్యనారాయణ

ఈ తరహా నేరాలు అరికట్టడానికే..

బాధిత కుటుంబ సభ్యులకు ఇది ఒక ఉపశమనం. భవిష్యత్తులో సమాజంలో ఇటువంటి నేరాలను అరికట్టడానికి ఈ కేసు ఒక ఉదాహరణగా నేను భావిస్తున్నాను. ప్రస్తుతం ఇటువంటి నేరాలు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ఇది ఒక మంచి సందేశం.

– తీర్పు సందర్భంగా న్యాయమూర్తి పి.కమలాదేవి

ప్రభుత్వం అండగా ఉంది



మా కుమార్తె దేవిక హత్య కేసును అత్యంత వేగవంతంగా కేవలం 4 నెలల 10 రోజుల్లోనే పరిష్కరించారు. ప్రభుత్వం మాకు అండగా ఉండటంతో పోలీసులు ఎంతో వేగంగా కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనివల్లనే నిందితుడికి శిక్ష పడింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జనవరిలో రూ.10 లక్షల ఆర్థిక సాయం వచ్చింది.

– కాదా నాగమణి, హతురాలి తల్లి

దిశ చట్టం స్ఫూర్తితో..

రాష్ట్రంలో మహిళల భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ చట్టాన్ని రూపొందించారు. ఆ స్ఫూర్తితోనే పోలీసులు దేవిక హత్య కేసు దర్యాప్తును చురుకుగా చేపట్టారు. వారి కృషి ఫలితంగానే నిందితుడికి 144 రోజుల్లోనే శిక్ష పడింది. పోలీసులకు అభినందనలు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. ఈ దారుణ ఘటన జరిగిన వెంటనే సీఎం దృష్టికి తీసుకువెళ్లాను. ఆయన వెంటనే స్పందించి హతురాలి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించి, అందజేశారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచింది. ముద్దాయికి ఇంత త్వరగా శిక్ష పడటానికి సీఎం జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధే కారణం. మహిళలను వేధించినా, అఘాయిత్యాలకు పాల్పడినా వారు ఎంతటి వారైనా రాష్ట్ర ప్రభుత్వం సహించదు.



– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్, అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా కమిటీ

గాలికుంటు.. టీకాతో తరిమికొట్టు

- ఎన్‌ఏడీసీపీలో భాగంగా వ్యాధి నివారణ టీకాలు
- నేటి నుంచి అమలుకు సన్నాహాలు
- జిల్లాకు 2.15 లక్షల డోసుల రాక

రాయవరం: వ్యాధులు దాడితో పశువుల్లో పాల ఉత్పాదక శక్తి తగ్గుతుంది. ఒక్కో సమయంలో ఆ పశువులు ప్రాణాలు కూడా కోల్పోతాయి. పశువులపై దాడి చేసే వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. వైరస్ ద్వారా వ్యాపించే ఈ వ్యాధిని ఫుట్ అండ్ మౌత్ డిసీజ్‌గా పేర్కొంటారు. పశుపోషకులు సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులను కాపాడుకోవచ్చని అంటున్నారు పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయపాల్. నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్‌ఏడీసీపీ) మూడో విడతలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణకు బుధవారం నుంచి నెల రోజుల పాటు సామూహిక టీకాల కార్యక్రమం చేపడుతున్నారు.

జిల్లాలోని పశువులకు అవసరమైన టీకాల్లో మొదటి విడతగా 2.15 లక్షల డోసులు జిల్లాకు చేరుకున్నాయి. నాలుగు నెలల పైబడి ఉన్న పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. నాలుగు నెలలు దాటి తొలిసారి టీకాలు వేయిస్తున్న దూడలకు నెల రోజుల తర్వాత బూస్టర్ డోస్ వేస్తారు. జిల్లాలో 75,460 గోజాతి, 1,53,542 గేదె జాతి పశువులు ఉన్నాయి. పశువైద్య శాఖ ద్వారా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 31 వరకూ ఈ టీకాలు వేస్తారు.

వ్యాధి లక్షణాలు

- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ.
- వ్యాధి సోకిన చూడి పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి.
- వ్యాధికి గురైన పశువులో తీవ్ర జ్వరం కనిపిస్తుంది.
- పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కాళ్లు కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలుంటే గాలికుంటు వ్యాధి సోకినట్టు గుర్తించాలి.
- వ్యాధి సోకిన గేదె, ఆవు పాలు తాగే దూడల్లో మరణాలుంటాయి. అందువలన వాటి పాలను దూడలు తాగకుండా చూసుకోవాలి.
- మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ వ్యాధి ఎక్కువ వస్తుంది.
- వ్యాధి వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి తగ్గుతుంది.
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీల ఫారిన్‌హీట్ వరకూ పెరిగిన పశువులు నీరసిస్తాయి.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి, 24 గంటల్లో చితికిపోతాయి. దీనివలన వచ్చే నొప్పితో పశువులు మేత తినక నీరసిస్తాయి.
- శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండవేడిమికి తట్టుకోలేవు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

- నోరు, కాలు వ్యాధికి గురైన పశువుల అంతఃస్రావాల (లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల మిగతా పశువులకు గాలికుంటు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.
- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒకచోటు నుంచి మరో చోటుకు వ్యాధికారక క్రిమి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణ చేపట్టండిలా..

- పశువులు బాగా బలహీనంగా ఉంటే రక్తంలోకి గ్లూకోజ్ ఇవ్వాల్సి ఉంటుంది.
- నోటిలో పుండ్ల వలన మేత మేయవు కాబట్టి.. సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని వాటికి అందించాలి.
- జావ, జొన్న, అన్నం, ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతి రోజూ తాగించడం ద్వారా బలహీనపడకుండా జాగ్రత్త వహించాలి.



చికిత్స

- కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి.
- నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి, గ్లిజరిన్ కలిపి పూయాలి.
- వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

- వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి.
- వీటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి.
- చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి.

రైతులు సహకరించాలి



పశువుల్లో గాలికుంటు వ్యాధి నిరోధానికి ప్రభుత్వం టీకాలు పంపిణీ చేసింది. నెల రోజుల పాటు సాగే ఈ టీకాల కార్యక్రమానికి పాడి రైతులు సహకరించాలి. నాలుగు నెలలు పైబడిన ప్రతి పశువుకూ టీకాలు వేయించాలి.

– డాక్టర్ అడిదెల జయపాల్, జేడీ, పశు సంవర్థక శాఖ, అమలాపురం


రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో 'తూర్పు' ప్రథమం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విజయవాడలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫేర్)లో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రెండు పాఠశాలల నమూనా ప్రాజెక్టులు ప్రథమ స్థానాలు సాధించాయి. ఈ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 నమూనా ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి వెళ్లాయి. వీటిలో ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగంలో రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎస్.సుమ ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం దక్కింది. అలాగే, మ్యాథమెటికల్ మోడలింగ్ విభాగంలో తాళ్లపూడి మండలం అన్నదేవరపుపేట ఏఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వి.చరణ్ ప్రాజెక్టుకు కూడా ప్రథమ బహుమతి లభించింది. ఇదే జిల్లా గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థిని కె.వి నూత్న సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్ విభాగంలో మూడో బహుమతి సాధించింది. ఈ మూడు ప్రాజెక్టులూ జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. బహుమతులు సాధించిన విద్యార్థులను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, సైన్స్ ఉపాధ్యాయులను డీఈఓ అబ్రహం అభినందించారు.


కొంతమూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న విద్యాశాఖాధికారులు

పర్యావరణం, ఉద్యోగాలకు ప్రాధాన్యం


ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత


కార్యక్రమంలో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- గ్రాసిమ్ పరిశ్రమ విస్తరణ గ్రామసభలో ప్రజల డిమాండ్
- బలభద్రపురంలో ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి, రాజమహేంద్రవరం/బిక్కవోలు: 'పరిశ్రమల స్థాపనకు వ్యతిరేకం కాదు.. గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రమాదకర రసాయనాలను తయారు చేస్తుందన్న అపోహ ఉంది.. పర్యావరణ పరిరక్షణకు కంపెనీ పాటు పడాలి. ఇప్పటికైనా పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి' అని గ్రామస్తులు, రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు. ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ గ్రాసిమ్ విస్తరణలో భాగంగా బిక్కవోలు మండలం బలభద్రపురం హైస్కూల్‌లో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సుమారు 2 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. గ్రాసిమ్ విస్తరణపై పలువురు తమ అభిప్రాయాలు తెలిపారు.

నాడు టీడీపీ ఏం చేసింది?

ప్రజాభిప్రాయ సేకరణలో టీడీపీ, వైఎస్సార్ సీపీ, ప్రజాసంఘాలకు చెందిన 23 మంది మాట్లాడారు. పరిశ్రమ విస్తరణకు 15 మంది అంగీకరించగా, ఎనిమిది మంది వ్యతిరేకించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు దీటుగా స్పందించారు. ఈ సందర్భంగా కాసేపు గందరగోళం ఏర్పడింది. పోలీసులు ఇరు వర్గాలకూ సర్ది చెప్పి సమావేశం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రాజకీయ లబ్ధి కోసమే ప్రజల్లో భయాందోళనలు పెంచుతున్నారన్నారు. గతంలో కేపీఆర్ ఇండస్ట్రీ నుంచి మామూళ్లు తీసుకున్నప్పుడు పర్యావరణం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు పాదయాత్రకు సైతం పరిశ్రమ యాజమాన్యం నుంచి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. గ్రాసిమ్ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తూంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. పరిశ్రమల వల్ల పర్యావరణానికి హాని కలిగితే ప్రజల పక్షాన తామే పోరాడతామని స్పష్టం చేశారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రాసిం విస్తరణ వల్ల కాలుష్య సమస్య తలెత్తుతుందన్నారు. దీనిని ప్రోత్సహించడం దారుణమన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ ఎస్.అశోక్ కుమార్, గ్రాసిమ్ సంస్థ ప్రతినిధులు జీఎం మురళీధర్, మేనేజర్ మురళీకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

వాయిదాలు చెల్లించలేదని భర్త కిడ్నాపు

- ఫైనాన్స్ కంపెనీపై భార్య ఫిర్యాదు
- 12 గంటల తరువాత వదిలేసిన సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రుణ వాయిదాలు చెల్లించలేదంటూ ఓ వ్యక్తిని ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం ఉదయం కిడ్నాప్ చేశారు. దీనిపై ఎనిమిది నెలల గర్భిణి అయిన అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. చివరకు అపహరించిన వ్యక్తిని ఆ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు 12 గంటల తర్వాత వదిలేయడంతో కథ సుఖాంతమైంది. ఇందుకు సంబంధించిన వివరాలివీ.. అమలాపురం ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న లంకలపల్లి రవీంద్ర స్థానిక పద్మ పూజిత ఫైనాన్స్ కంపెనీ నుంచి మోటార్ సైకిల్ తీసుకుని నెలానెలా వాయిదాలు చెల్లిస్తున్నారు. కొన్ని వాయిదాలు చెల్లించకపోవడంతో ఆ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం ఉదయం రవీంద్ర ఇంటికి వచ్చారు. వాయిదాలు చెల్లించాలని తీవ్రంగా హెచ్చరించారు. ఆ సమయంలో తమను ఇంట్లోనే కొద్దిసేపు నిర్బంధించారని, కొద్దిసేపటి తర్వాత తన భర్తను వారు కిడ్నాప్ చేసి, తీసుకు వెళ్లిపోయారని రవీంద్ర భార్య శిరీష ఆరోపించింది. తక్షణమే ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తన భర్తను ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు కిడ్నాప్ చేశారని, ఆయనను రక్షించాలని, వారిపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. తన భర్త క్షేమంగా వస్తేనే కానీ స్టేషన్ నుంచి వెళ్లనని ఒక దశలో ఆమె పట్టుబట్టింది. ఈ నేపథ్యంలో పట్టణ ఎస్సై హరీష్‌కుమార్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల ఆచూకీ తెలుసుకుని, రవీంద్రను విడిపించే ఏర్పాట్లు చేశారు. రవీంద్రను ఆ కంపెనీ ప్రతినిధులు అమలాపురం నుంచి రావులపాలెం తీసుకు వెళ్లినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. పద్మ పూజిత ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై కిడ్నాపు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు.

దొంగతనం కేసులో ముద్దాయిలకు జైలు

కపిలేశ్వరపురం: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.దీప దైవకృప మంగళవారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం.. మండలంలోని కాలేరు గ్రామానికి చెందిన గొడితి సత్యనారాయణ ఇంట్లో గత ఏడాది అక్టోబర్‌లో దొంగతనం జరిగింది. దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి బంగారం, నగదు దోచుకుపోయారు. దీనిపై అదే నెల 28న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాటి ఎస్సై బి.సంపత్‌కుమార్ కేసు నమోదు చేశారు. సాక్ష్యాలను మండపేట రూరల్ సీఐ పి.శివగణేష్ కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో నిందితులు పెచ్చెట్టి విజయ్, గెద్దాడ సురేంద్రలకు చెరొక ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల శ్రీరాములు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తుని: స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనల వివరాలను ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తుని మండలం హంసవరం – అన్నవరం మధ్యన తిమ్మాపురం వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి గుర్తు తెలియని 35 నుంచి 40 ఏళ్ల వయస్సు వ్యక్తి మృతి చెందాడు. కుంకుమ రంగు టీషర్ట్, సిమెంట్ రంగు ఫుల్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అలాగే, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన పట్టాలు దాటుతూండగా రైలు ఢీకొని గుర్తు తెలియని 40 ఏళ్ల వయస్సు వ్యక్తి మృతి చెందాడు. స్కై బ్లూ కలర్ చొక్కా ధరించి ఉన్నాడు. కాలర్ వద్ద ఫేమస్ టైలర్, తుని స్టిక్కర్ ఉంది. కాళ్లకు, చేతులకు రక్ష రేకులు కట్టుకున్నాడు. ఈ రెండు కేసులలో మృతుల వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మారూఫ్ తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి టైలర్ల క్షీరాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యే రాపాక, టైలర్ల క్షీరాభిషేకం

మలికిపురం: తమ బతుకుల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పలువురు టైలర్లు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. టైలర్స్ డే సందర్భంగా మలికిపురంలో దర్జీలు ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత కుట్టు మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడు ముగ్గళ్ల మురళీకృష్ణ తదితరులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా టైలర్లను ఆదుకున్నది సీఎం జగన్ మాత్రమేనని గుర్తు చేశారు. ఇకపై టైలర్లందరూ ఆయన వెంటే ఉంటారని అన్నారు. టైలర్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి టైలర్ల అభివృద్ధి కోసం జీఓ తీసుకు వచ్చారని మురళీకృష్ణ చెప్పారు. ప్రస్తుత సీఎం జగన్ టైలర్లకు ఏటా రూ.10 వేల చొప్పున జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్నారని అన్నారు. టైలర్లకు ఇటువంటి రోజులు వస్తాయని తాము ఊహించలేదని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, టైలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ దర్జీలను సన్మానించారు.